# ఉమన్ ఎట్ 45



**లంచ్ తీసుకుంటూ** 'ది రిచ్ అండ్ ది బోల్డ్ మేగజైన్లో "ఉమెన్ ఎట్ 45" వ్యాసం చదవడం ముగించాడు రాజా. పుస్తకం కింద పెట్టగానే ఏసీ స్పీడు పెంచాడు. అయినా పట్టిన చెమట్లు ఆరలేదు. వ్యాసం చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. నలభై అయిదేళ్ల భార్య ఉన్న భర్తలు ఎలాంటి జాగ్రత్తలు పడాలో రాశాడు ఆ వ్యాసకర్త వెంకట్. పదహారేళ్ల వయస్సులో కన్నా నలభై అయిదేళ్ల వయస్సు ఆడవాళ్లకు ఎక్కువ ప్రమాదకరమైనదని వివరణలతో రాసుకొచ్చాడు.

'పదహారేళ్ల వయస్సులో సెక్స్ ఇచ్చే ఆనందం గురించి సందేహాలు ఉంటాయి. కడుపొస్తుందన్న భయం ఉంటుంది. బయటపడితే పెళ్లి కాదేమోనన్న బెరుకు ఉంటుంది. కానీ నలభై ఐదేళ్ల వనితకు ఈ భయాలూ, బెంగలూ లేవు. సెక్స్ తనివితీరా అనుభవించి, ఆనందించి, ప్రయోగాలు చేసేటంతగా శృంగారం గురించి అవగాహన ఉంటుంది. దానిలో లోతుపాతులు తెలిసి, ఏ విధమైన క్రీడతో తాను తృప్తిపడగలదో, తృప్తి పరచగలదో తెలుసుకుని భాగస్వామికి చెప్పి చేయించుకోగల ప్రౌఢత్వం అబ్బుతుంది. గర్భవతి అయ్యే ప్రమాదాలు దాదాపు తొలగిపోయినట్లే.

భర్త సమాజంలో మంచి పొజిషన్లో ఉంటాడు. ఆమె ఏదైనా ఎఫైర్ సాగించి, అది భర్తకు తెలిసినా పిల్లల భవిష్యత్తును, సమాజంలో అతని స్థానాన్ని నిలబెట్టుకోవలసిన అగత్యాన్నీ దృష్టిలో

— ఎమ్బీయస్ ప్రసాద్

పెట్టుకుని మందలించి వదిలేస్తాడు కానీ రచ్చకెక్కడు. ఒకవేళ ఇంట్లోంచి బయటకు గెంటేసే రకమైనా ఆమె పేర కొన్ని స్థిరచరాస్తులు ఏర్పడి ఉంటాయి. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోగల ఆర్థిక స్తోమత, మనోస్థైర్యం అమిరి ఉంటాయి. రిస్కు తక్కువ కాబట్టి ఎలాగోలా, ఏదో ఒక విధంగా సుఖపడదామని తనువు, మనసు తొందరపెడతాయి.

అన్నిటికన్నా ముఖ్యమైనది భర్త అందుబాటులో లేకపోవడం. జీవితంలో పైకి వద్దామనే తాపత్రయంలో అతను సంసార సుఖానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం, బయట ఉరుకులు, పరుగులు పెట్టి, ఇంటికొచ్చి ఆదమరచి నిద్రపోవడం, చాలా రోజులు భార్యకు దూరంగా వేరే ఊళ్లల్లో గడపడం, మనసు విప్పి మాట్లాడుకుని సేదతీరే తీరిక లేకపోవడం – వీటివల్ల ఆ వయసు మహిళ బోర్‌గా ఫీలవుతుంది. పిల్లలు కూడా కాలేజీ చదువుల్లో పడి వాళ్లకు కూడా తన అవసరం పడకపోవడంతో ఒంటరితనం ఫీలవుతుంది. ఆ డిప్రెషన్ దూరం చేసుకోవడానికైనా సాహసం చేయాలని ఆరాటపడుతుంది.

అందువల్ల భార్య ఆ వయసుదైతే భర్త హెచ్చరికగా ఉండి ఆమెను తన చెంతనే నిలుపుకోవడానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలి!'

వ్యాసకర్త ఇదంతా రాసి తనకు తెలిసున్న ఒక స్త్రీ గురించి రాశాడు. ఆవిడ కోరికపై పేరు మార్చాట్ట కానీ రాసినదంతా నిజమేనట. ఆమె భర్త పెద్ద బిజినెస్ మాగ్నెట్. దేశ, విదేశాలు తిరుగుతూ ఉంటాడు. పరాయి స్త్రీలతో జల్సా చేస్తూంటాడు. కానీ భార్యంటే అభిమానం ఉంది. పిల్లలు పెద్దవాళ్లయ్యారు. ఆమె బోరుగా ఫీలయ్యేది. భర్తకు తనంటే ఇష్టం కదాని ఆమె పక్కచూపులు చూడకుండా కాలక్షేపం చేసుకొచ్చింది. కానీ అదీ నలభై ఐదేళ్ల తర్వాత ఆమె వ్యాసకర్తను ఒక వీడియోకాసెట్ షాపులో కలిసింది. కాలక్షేపం కబుర్లతో ప్రారంభమైన వారి స్నేహం క్రమంగా శారీరక సంబంధానికి దారితీసింది. దానివల్ల జరిగిన మేలేమిటంటే ఆమెకు జీవితంపై ఆసక్తి పెరిగింది. భర్తను సాధించడం మానేసింది. అతనూ సంతోషంగా ఉన్నాడు కానీ తను పోగొట్టుకున్నదేమిటో అతను తెలుసుకోలేకపోయాడు అంటూ ముగిసిందా వ్యాసం.

సాయంత్రం లోపల వ్యాసం మూడుసార్లు చదివాడు రాజా. 'దీనిలో ప్రతిబింబిస్తోన్నది నిస్సందేహంగా నా జీవితమే!' అనిపించిందతనికి చివరికి. భార్య సావిత్రి అందగత్తె. బోరు ఫీలవుతున్న హౌస్ వైఫ్. తను బయట మజా చేసే రకమే. ఈ మధ్య సావిత్రి ఇదివరకటికంటే తనతో సఖ్యంగా ఉంటోంది. బైది వే... ఈ వ్యాసంలో మహిళ పేరు సవిత. కొంపదీసి సావిత్రి గురించే రాయలేదు కదా! ఇంపాజిబుల్! సావిత్రి అంత తెగించే రకం కాదు, తనకు తెలుసు. కానీ హూ నోస్? తనకి నలభై ఐదు నడుస్తోంది. వ్యాసంలో చెప్పినట్టు డేంజరస్ జోన్‌లోకి అడుగుపెట్టింది. తను జాగ్రత్తపడి ఏదైనా చేకపోతే సావిత్రి తనకు దూరం కావచ్చు.

ఆఫీసు పనుల్లో మునిగి తేలుతున్నా ఈ విషయం గురించి రాజా మెదడు పనిచేస్తూనే ఉంది. వచ్చే నెల్లో యూరోప్ ట్రిప్ ఉంది. ఖర్చయితే అయిందని సావిత్రిని తనతోబాటు యూరోప్ తీసుకెళ్తే తామిద్దరి మధ్య పూర్వపు అనుబంధం నెలకొనవచ్చు. ఆమె పక్కదారులు పట్టకుండా నిరోధించవచ్చు. కనీసం పది రోజులు కలిసిమెలిసి తిరుగుతాం. కొత్త ప్రదేశాలు కలిసి చూస్తాం. పారిస్ నైట్ క్లబ్స్ లాంటి రసభరితమైన ప్రదేశాలలో మసలినప్పుడు కోరిక దానంతట అదే పుట్టుకొస్తుంది.

బాగానే ఉంది కానీ యూరోప్‌కి, పారిస్‌లాంటి సిటీకి పోయి పోయి భార్యతో వెళ్లడమా? హుఁ ... కొత్త సెక్రటరీ షీలా తను చెప్పినమాట పూర్తిగా వినడం లేదు. పైపైనే కాలక్షేపం చేయమంటోంది. ఈ యూరోప్ ట్రిప్ మీద ఆమెకీ ఆశ ఉంది. తను తీసుకెళ్తే ఆనందంగా తన పక్కలోకి వాలడం తథ్యం. ఆపిల్ పండులాంటి షీలాను తనివితీరా కొరుక్కుతినేయవచ్చు. మళ్లీ ఇంకెక్కడికీ తీసుకెళ్లకపోయినా సరే జీవితాంతం తను చెప్పినట్టు వింటుంది.

షీలా ప్రాబ్లెమ్ సాల్వయింది. కానీ సావిత్రి మాట? ఏం చేయాలి? తను కూడా చేజారిపోకుండా

చూసుకోవాలి. ఎలా? ఆఁ, ఢిల్లీ... వచ్చే వారం ఢిల్లీ వెళ్లే పని ఉంది. ఫాక్టరీ లైసెన్సు గురించి వెళ్లి మినిస్టర్లను కలవాలి. కనీసం వారం రోజులు అక్కడే ఉండాలి. లలితను ఢిల్లీ తీసుకెళ్లి వారంరోజుల పాటు శృంగారంలో ముంచెత్తితే సరి. అదే దారికి వస్తుంది. కావాలంటే ఖరీదైన బహుమతులు కూడా కొని ఇవ్వవచ్చు.

రాజా అనుకున్నది చేసితీరే రకం. ఢిల్లీ ట్రిప్ అనుకున్న ప్రకారం తు.చ. తప్పకుండా చేసి చూపించాడు. ఫైవ్‌స్టార్ హోటల్లో బస, స్విమ్మింగ్ పూల్‌లో సాయంత్రాలు, వీడియో సినిమాలు, రాత్రిళ్లు కొత్త కొత్త ప్రయోగాలు రతిబంధనాలు... సావిత్రి గుమ్మెత్తిపోయింది. కన్నెపిల్లలా కువకువలాడింది. జీవితాన్ని దోసిళ్లతో గ్రోలినట్లు ఉక్కిరిబిక్కిరయింది. రాజా ఎప్పటికీ తనను కాదని భార్య పక్కచూపులు చూడకుండా చేసినందుకు తనను తానే అభినందించుకున్నాడు. ఇదేవిధంగా షీలాను కూడా యూరోప్ ట్రిప్ వలతో తన గుప్పిట్లోంచి పోనీయకుండా చూడవచ్చని అంచనా వేశాడు.

ఢిల్లీ నుండి తిరిగి వచ్చేటప్పుడు విమానంలో సావిత్రి భర్త ఒడిలో ఒదిగిపోతూ, “ఒక విషయం అడుగుతాను, నిజం చెప్తారా?” అంది.

కిటికీలోంచి మేఘాలు చూస్తూ, వాటిల్లో తేలిపోతున్న రాజా “అడుగు, చెప్తాను!” అన్నాడు.

“నా గురించి ఇంతగా పట్టించుకుని ఇన్నాళ్లకు ఇంతటి సుఖాన్ని కలగజేశారు కదా, కారణం ఏదైనా ఉందా?” అడిగింది సావిత్రి అతని అరచేతిని రాస్తూ.

“నిజం చెప్పమన్నావు కాబట్టి చెప్తా!” అంటూ రాజా తను చదివిన వ్యాసం గురించి చెప్పుకొచ్చాడు. అది మనలాంటి కేసే అనిపించింది. అందునా ఆ ఉదాహరణలో ఇచ్చిన అమ్మాయిది ఇంచుమించు నీ పేరే...” అంటుండగానే సావిత్రి దిగ్గున లేవబోయి, “ఏమిటీ, వెంకీ నా గురించి రాశాడా?” అంది కంగారుపడుతూ.

‘వెంకీ? అంటే వ్యాసకర్త వెంకట్ ముద్దుపేరా? సావిత్రి కెలా తెలుసు?’ రాఘవరావు తికమకపడుతూ “ఆ వెంకట్ వ్యాసం సంగతే... అదే... అతను నీకెలా తెలుసు?” అన్నాడు.

“ఉమెన్ ఎట్ 45 అని ఒక ఫారిన్ మేగజేన్లో వ్యాసం ఆర్నెల్ల క్రితమే వచ్చింది. నేనూ, వెంకీ కలిసే అది చదివాం. దాన్ని తిరగరాసి ఇండియన్ మేగజైన్‌కి పంపుతానన్నాడు తను. సరేలే అనుకున్నాను కానీ నా కేసే రాస్తాడని అనుకోలేదు”

“వెంకీ, వెంకీ అంటున్నావు. మీ ఇద్దరూ అంత క్లోజా? పైగా వ్యాసంలోది నీ కేసే అంటున్నావు. అంటే...” నోట తడారిపోతూండగా రాజా ఆ పైన అడగలేకపోయాడు.

సావిత్రి మాత్రం గిల్టీగా ఫీలవలేదు. “మీ సంగతి కూడా దానిలో రాశారుగా. భర్త అలా ఉంటే నలభై ఐదేళ్ల భార్యలందరూ ఏం చేస్తారో ఆ ఫారిన్ మేగజైన్లో రాశారుగా. నేను మాత్రం వేరే విధంగా ఎందుకుండాలి? అదే చేశాను. ఈ ఢిల్లీ ట్రిప్ ఆర్నెల్ల క్రితమే చేసి ఉంటే కథే వేరుగా ఉండేది!” అంది నిబ్బరంగా.

రాజా కాస్సేపు ఏమీ మాట్లాడలేదు. కాస్త నీళ్లు తెప్పించుకుని తాగాక, తెప్పరిల్లి, “నిన్ను తప్పుపట్టే స్థితిలో నేను లేననుకో. కానీ ఆ వ్యాసంలో రాసిన ప్రకారం తూ.చా. తప్పకుండా చేద్దామనుకున్నా... నీ కింకా నలభై నాలుగేగా. తొందరపడ్డావేం? నీకు నలభై అయిదేళ్లు ఫిబ్రవరికి కదా పూర్తయ్యేది!”

సావిత్రి ఆశ్చర్యపడింది. “అంటే నలభై ఐదేళ్లు పూర్తయితేనే నలభై అయిదు అంటారా? నాకు తెలియదు. నలభై ఐదు ప్రారంభమైంది కదా, ఆ వ్యాసంలో చెప్పినట్టు చేయవచ్చు అనుకున్నాను!” అంది తొందరపడి ముందే కోసిన ఆ కోయిల.

●

(ఆంధ్రప్రభ వీక్లీ ఏప్రిల్ 2000)